## మూడ్రోజుల్లో ఏఎమ్మార్పీ నీటి విడుదలకు చర్యలు

### ఇరిగేషన్, జెన్‌కో సీఈలు అజయ్‌కుమార్, మంగేశ్‌కుమార్

పెద్దఅడిశర్లపల్లి, సెప్టెంబర్ 14 : పుట్టంగండి పుంపుహౌస్‌లో ఏఎమ్మార్పీ మోటార్ల మరమ్మతులు వేగవంతంగా సాగుతున్నాయని, రెండు, మూడ్రోజుల్లో నీటి విడుదలకు చర్యలు తీసుకుంటామని ఇరిగేషన్ సీఈ అజయ్‌కుమార్, జెన్‌కో సీఈ మంగేశ్‌కుమార్ అన్నారు. పుట్టంగండి పుంపుహౌజ్‌లో కొనసాగుతున్న మొదటి యూనిట్ మోటార్ మరమ్మతులను శనివారం పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రస్తుతం వర్షాలు ఆగిపోవడంతో వ్యవసాయానికి నీటి వినియోగం పెరుగుతుందని, దీంతో రైతుల నుంచి నీటి విడుదలకు ఒత్తిడి వస్తున్నందున మరమ్మతులు వేగంగా చేపడుతున్నామని అన్నారు. కూలీల సంఖ్యను మరింత పెంచామని, ప్రస్తుతం మోటార్ అలైన్‌మెంట్ ప్రక్రియ కొనసాగుతుందని తెలిపారు. అనంతరం ట్రయల్ రన్ చేయనున్నట్లు పేర్కొన్నారు. ప్రస్తుతం ఏఎమ్మార్పీ నుంచి మూడు మోటార్ల ద్వారా నిరంతరం 1800 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నట్లు తెలిపారు. వారి వెంట ఇరిగేషన్ డీఈ నాగయ్య, ఏఈ శిల్ప, జెన్‌కో ఏడీలు సుధాకర్, సంజీవరెడ్డి, సత్యనారాయణ ఉన్నారు.



బుద్ధవనంలోని ధ్యాన మందిరంలో కుటుంబ సభ్యులతో హైకోర్టు న్యాయమూర్తి సృజన

## బౌద్ధ సందర్శన ప్రదేశాల్లో బుద్ధవనం ప్రథమం

### హైకోర్టు న్యాయమూర్తి సృజన

నందికొండ, సెప్టెంబర్ 14 : బౌద్ధ సందర్శన ప్రదేశాల్లో నాగార్జునసాగర్ హిల్‌కాలనీలోని బౌద్ధ వారసత్వ నిలయం బుద్ధవనం ప్రథమంగా నిలుస్తుందని రాష్ట్ర హైకోర్టు న్యాయమూర్తి కె.సృజన అన్నారు. శనివారం కుటుంబ సమేతంగా నాగార్జునసాగర్‌లోని పర్యాటక ప్రాంతాలను సందర్శించారు. విజయవిహార్ చేరుకున్న వారికి నిడమనూరు కోర్టు న్యాయమూర్తి అపూర్వ రవళి పుష్పగుచ్ఛం ఇచ్చి స్వాగతం పలికారు. నాగార్జునసాగర్ డ్యామ్, ప్రధాన జల విద్యుత్ కేంద్రం, ఎత్తిపోతల జలపాతం సందర్శించారు. అనంతరం బుద్ధవనంలో జాతక పార్కు, అవకాన బుద్ధ, బుద్ధ చరితవనం, మహాస్థూపం, ధ్యాన మందిరాన్ని తిలకించారు. పర్యాటక ప్రాంతాల విశేషాలను టూరిజం గైడ్ సత్యనారాయణ వివరించారు. వారి వెంట కోర్టు సిబ్బంది చంద్రశేఖర్, ఎస్ఐ సంపత్‌గౌడ్, ఆర్ఐ దండు శ్రీనివాస్ ఉన్నారు.

# నిఘా నీడలో గణేశ్ నిమజ్జనం



- జిల్లావ్యాప్తంగా 1,660 సీసీ కెమెరాలతో నిరంతర పర్యవేక్షణ
- 950 మంది సిబ్బందితో భారీ బందోబస్తు
- జిల్లా కేంద్రంలో ట్రాఫిక్ డైవర్షన్
- అవాంఛనీయ ఘటనలు చోటుచేసుకోకుండా పటిష్ట భద్రత
- నిమజ్జన ప్రాంతాల్లో గజ ఈతగాళ్ల ఏర్పాటు

### శోభాయాత్రకు 4,831 విగ్రహాలు

నవరాత్రులు పూజలు అందుకున్న వినాయకుడికి సోమవారం ఘనంగా వీడ్కోలు పలికేందుకు భక్తులు సిద్ధమవుతుండగా, ప్రశాంత వాతవరణంలో శోభాయాత్రలు సాగేందుకు పోలీస్ యంత్రాంగం అవసరమైన అన్ని చర్యలు తీసుకుంటున్నది. నల్లగొండ జిల్లావ్యాప్తంగా అన్ని ప్రధాన రహదారులతోపాటు వివిధ కాలనీల్లో ఏర్పాటు చేసిన కమ్యూనిటీ సీసీ కెమెరాలతోపాటు ప్రత్యేకంగా మరో 280 సీసీ కెమెరాలు ఏర్పాటు చేసింది. వాటన్నింటిని స్థానిక పోలీస్‌స్టేషన్‌తోపాటు జిల్లా పోలీస్ కార్యాలయానికి అనుసంధానం చేసి నిరంతర నిఘా పెట్టనుంది. జిల్లా కేంద్రంలోని కమాండ్ కంట్రోల్ రూమ్ నుంచి ఎస్పీతోపాటు ఐటీ సెల్ అధికారులు పర్యవేక్షించనున్నారు. ఇప్పటికే అన్ని గణేశ్ విగ్రహాలకు జియో ట్యాగింగ్ చేసిన పోలీసులు.. కేటాయించిన నంబర్ల వారీగా శోభాయాత్ర సాగేలా స్పష్టమైన ఆదేశాలు ఇచ్చారు. 14 ఫీట్లకు పైన ఉన్న విగ్రహాలను నాగార్జునసాగర్, వాడపల్లిలో, మిగతావి ఇతర ప్రాంతాల్లో నిమజ్జనం చేసేందుకు ఏర్పాటు చేశారు. జిల్లా కేంద్రంలో 9 ఫీట్లకు లోపు ఏర్పాటుచేసిన విగ్రహాలను స్థానిక వల్లభరావు చెరువులో నిమజ్జనం చేయనున్నారు. మొత్తం 950మంది పోలీస్ సిబ్బంది, పోలీస్ వలంటీర్లు విధుల్లో ఉండనున్నారు. నిమజ్జనం సందర్భంగా అవాంఛనీయ ఘటనలు చోటుచేసుకోకుండా కమ్యూనిటీ సంబంధిత కేసులు నమోదైన వారిని ఇప్పటికే బైండోవర్ చేశారు. రౌడీ షీటర్లతోపాటు క్రిమినల్ రికార్డ్ ఉన్న వారి కదలికలపై ప్రత్యేక నిఘా పెట్టారు.



నల్లగొండలోని వల్లభరావు చెరువు వద్ద నిమజ్జన ఏర్పాట్లు

నల్లగొండ జిల్లా కేంద్రంలో శోభాయాత్ర, నిమజ్జనానికి గణేశ్ ఉత్సవ కమిటీ, అధికారులు అన్ని ఏర్పాట్లు చేశారు. నిమజ్జన ప్రాంతాలను కలెక్టర్, ఎస్పీలు ఇప్పటికే పరిశీలించి పలు సూచనలు చేశారు. జిల్లా కేంద్రంలోని వల్లభరావు చెరువు, జిల్లాలోని వాడపల్లి, అడవిదేవులపల్లి, నాగార్జునసాగర్, దేవరకొండ, పెద్ద మునిగల్, డిండి, మిర్యాలగూడ, వేములపల్లి కాల్వల వద్ద పోలీస్ శాఖ పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేసింది. ఆయాచోట్ల విద్యుద్దీపాలతోపాటు బారికేడ్లు, క్రేన్లు ఏర్పాటు చేశారు. గజ ఈతగాళ్లను అందుబాటులో ఉంచారు. శోభాయాత్ర సందర్భంగా జిల్లాలోని అన్ని వైన్ షాపులను 24 గంటల ముందే మూయించనున్నారు.

### నల్లగొండలో ట్రాఫిక్ డైవర్షన్

- ❖ గణేశ్ శోభాయాత్ర సందర్భంగా జిల్లా కేంద్రంలో ప్రజలు, వాహనదారులకు ఇబ్బందులు కలుగకుండా ట్రాఫిక్ డైవర్షన్ చేశారు.
- ❖ హాలియా, దేవరకొండ రోడ్డు నుంచి హైదరాబాద్ వైపు వెళ్లే వాహనాలను ఈద్గా వయా మునుగోడు బైపాస్ మీదుగా దారి మళ్లించారు.
- ❖ హైదరాబాద్ నుంచి మిర్యాలగూడ వెళ్లే వాహనాలు నార్కట్‌పల్లి, నకిరేకల్ వయా తిప్పర్తి మీదుగా దారి మళ్లించారు.
- ❖ మిర్యాలగూడ నుంచి హైదరాబాద్ వెళ్లే వాహనాలు తిప్పర్తి, నకిరేకల్, నార్కట్‌పల్లి మీదుగా వెళ్లాలి.

### శోభాయాత్రకు ఏర్పాట్లు పూర్తి

జిల్లాలో నిమజ్జనం చేసే ప్రధాన ప్రాంతాలైన నల్లగొండ పట్టణంలోని వల్లభరావు చెరువు, మూసీ నది, 14వ మైలురాయి, మిర్యాలగూడ, వాడపల్లి, నాగార్జునసాగర్, దేవరకొండ, దయ్యాలగండి, అడవిదేవులపల్లి, కొండభీమనపల్లి, డిండి, వేములపల్లి కాల్వల వద్ద పోలీస్ శాఖ పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేసింది. ఫ్లడ్ లైట్లు, క్రేన్లను, పోలీస్ పికెట్‌లను ఏర్పాటు చేశారు. నిమజ్జన ప్రాంతాల వద్ద గజ ఈతగాళ్లను అందుబాటులో ఉంచారు. ఎక్కడ ఏ సంఘటన జరిగినా జిల్లాలోని ఏ ప్రాంతానికైనా ఐదు నుంచి పది నిమిషాల వ్యవధిలో చేరుకునేలా పెట్రో వాహనాలు, బ్లూకోట్స్, సంబంధిత పోలీస్ అధికారులను అప్రమత్తం చేసే విధంగా ఆన్‌లైన్ విధానంలో భద్రతను పర్యవేక్షిస్తున్నారు.

### 950మందితో భద్రత

గణేశ్ నిమజ్జనం సందర్భంగా జిల్లా పోలీస్ శాఖ భారీ బందోబస్తు ఏర్పాటు చేసింది. జిల్లాలో ఎస్పీతోపాటు ఇద్దరు ఏఎస్పీలు, ఆరుగురు డీఎస్పీలు, 28 మంది సీఐలు, ఐదుగురు ఆర్ఐలు, 70మంది ఎస్ఐలు, 620 మందికి పైగా ఏఎస్ఐలు, హెడ్ కానిస్టేబుళ్లు, కానిస్టేబుళ్లు, హోంగార్డులు, ఏఆర్ సిబ్బంది బందోబస్తు విధులు నిర్వహించనున్నారు. వీరికి అదనంగా ఒక్కో సబ్ డివిజన్‌కు 80మంది చొప్పున మూడు డివిజన్లకు 250 మంది ట్రైనీ కానిస్టేబుళ్లను భాగస్వాములను చేస్తున్నారు. వీరితోపాటు తెలంగాణ స్పెషల్ పోలీస్, ఫారెస్టు, అబ్కారీ శాఖల అధికారులను సైతం బందోబస్తులో భాగస్వామ్యం చేశారు.

### భక్తులు పాటించాల్సిన నిబంధనలు

- ❖ శోభాయాత్ర జరిగే ప్రాంతాల్లో ట్రాఫిక్ డైవర్షన్ ఉన్నందున ప్రజలు దానికి అనుగుణంగా నడుచుకోవాలి.
- ❖ వినాయక విగ్రహాలను తీసుకెళ్లే వాహనాలను చెకప్ చేయించుకోవాలి.
- ❖ మద్యం తాగి వాహనాలు నడుపరాదు. వాహనదారులకు పరీక్షలు చేసి మద్యం తాగిన వారిపై చర్యలు తీసుకుంటారు.
- ❖ డీజేలకు ఎట్టి పరిస్థితిలోనూ అనుమతి లేదు. పటాకులు కాల్చరాదు.
- ❖ మహిళలు విలువైన వస్తువులు ధరించకుండా ఉంటే మేలు. ఊరేగింపు సమయంలో చిన్న పిల్లలు తప్పిపోయే అవకాశం ఉంటుంది. కాబట్టి తల్లిదండ్రులు తగు జాగ్రత్తలు తీసుకోవాలి.
- ❖ నిమజ్జనం జరిగే ప్రాంతంలో చెరువులు, కాల్వల వద్ద చిన్న పిల్లలను అనుమతించరు.



సూర్యాపేటలో మినీ ట్యాంక్‌బండ్‌ను పరిశీలిస్తున్న ఎస్పీ సన్‌ప్రీత్ సింగ్

## గణేశ్ నిమజ్జనానికి పటిష్ట బందోబస్తు

### సూర్యాపేట జిల్లా ఎస్పీ సన్‌ప్రీత్ సింగ్

బొడ్రాయిబజార్, సెప్టెంబర్ 14 : సోమవారం నిర్వహించే గణేశ్ నిమజ్జనోత్సవానికి పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేసినట్లు సూర్యాపేట జిల్లా ఎస్పీ సన్‌ప్రీత్ సింగ్ తెలిపారు. విగ్రహాల తరలింపు సమయంలో ఆలస్యం చేయకుండా ఉత్సవ కమిటీలు తగిన జాగ్రత్తలు పాటించాలని సూచించారు. జిల్లా కేంద్రంలోని విగ్రహాలను నిమజ్జనం చేయనున్న సద్దుల చెరువు మినీ ట్యాంక్‌బండ్‌ను శనివారం ఆయన పరిశీలించి మాట్లాడారు. జిల్లా వ్యాప్తంగా 2700 విగ్రహాలకు అనుమతి ఇచ్చామని, 16న అన్ని విగ్రహాల నిమజ్జనం పూర్తి కావాలని అన్నారు. నిమజ్జన సమయంలో ప్రజలు, భక్తులకు ఇబ్బందులు కలుగకుండా అన్ని శాఖల అధికారుల సమన్వయంతో క్రేన్లు, లైటింగ్, నిమజ్జన హెల్పర్లు, గజ ఈతగాళ్లు, శానిటేషన్ ఏర్పాట్లు చేయాలని అధికారులకు సూచించారు. ప్రజలు, భక్తులు, ఉత్సవ కమిటీ సభ్యులు పోలీసులకు సహకరించి నిమజ్జనం ప్రశాంత వాతావరణంలో జరుపుకోవాలన్నారు. జిల్లా కేంద్రంలో మినీ ట్యాంక్‌బండ్, సూర్యాపేట మండల పరిధిలో మూసీ ప్రాజెక్టు, కోదాడ పెద్ద చెరువు, అనంతగిరి మండలం పాలేరు వాగు, చింతలపాలెం మండలం బుగ్గ మాదారం పుష్కర ఘాట్, మట్టపల్లి వద్ద కృష్ణానది, మహంకాళిగూడెం పుష్కర ఘాట్, మండలాల్లో స్థానిక చెరువులను జిల్లా వ్యాప్తంగా 38 నిమజ్జన ప్రదేశాలను గుర్తించినట్లు తెలిపారు. గణేశ్ విగ్రహాలను స్థానిక చెరువుల్లో నిమజ్జనం చేయాలని, దూరంగా వెళ్లి ప్రమాదాల బారిన పడవద్దని, తాగునీటి కోసం ఉపయోగించే కాల్వల్లో నిమజ్జనం చేయవద్దని సూచించారు. శోభాయాత్రను పోలీసులు నిశితంగా పరిశీలన చేస్తారని, సీసీ కెమెరాలతో నిఘా ఉంచి వీడియో రికార్డింగ్, ఫొటోలు తీయడం చేస్తారని తెలిపారు. ఊరేగింపు వాహనాలు కండీషన్‌లో ఉండాలని, డ్రైవర్లు జాగ్రత్తలు పాటించాలని, పిల్లలు, వృద్ధులను వాహనాల్లో ఎక్కించవద్దని హెచ్చరించారు. మద్యం తాగి ఇతరులకు అసౌకర్యం కల్పించవద్దని, వికృతమైన సినిమా పాటలతో డ్యాన్స్‌లు చేయవద్దని, హాస్పిటల్, మసీదులు, చర్చిలు, స్కూల్, వృద్ధాశ్రమాలు ఉన్నచోట శబ్దాలు చేయవద్దని అన్నారు. ఎస్పీ వెంట డీఎస్పీ రవి, పట్టణ సీఐ రాజశేఖర్, సూర్యాపేట రూరల్ సీఐ సురేందర్‌రెడ్డి, ఎస్‌బీ ఇన్‌స్పెక్టర్ వీరరాఘవులు, ట్రాఫిక్ ఎస్ఐ సాయిరాం ఉన్నారు.


ఇంజనీర్స్ డే శుభాకాంక్షలు
ఐకాన్ సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్
గ్యాస్ట్రో, యూరాలజీ, గుండె, వెన్నెముక మరియు నరాల దవాఖాన
సెల్: 7842157372, 9618289117
గ్యాస్ట్రో క్యాంప్
01-09-2024 నుండి 30-09-2024 వరకు
మన ఐకాన్ హాస్పిటల్ నందు
గ్యాస్ట్రో ఓపి ఉచితం
ఎండోస్కోపి - 1500 - 500
అతి తక్కువ ఖర్చుతో అన్ని గ్యాస్ట్రో జనరల్ సర్జరీలు చేయబడును
యూరాలజీ సంబంధిత సర్జరీలు ఆరోగ్యశ్రీ ద్వారా ఉచితంగా చేయబడును
మెదడు మరియు వెన్నెముక, యాంజియోగ్రామ్, స్టంట్, యాంజియోప్లాస్టి ఆపరేషన్లు చేయబడును
గవర్నమెంట్ హాస్పిటల్ వెనుక, శ్రీకృష్ణ టెంపుల్ ప్రక్కన, ఆర్.టి.సి. కాలనీ, విద్యానగర్, నల్లగొండ




హుజూర్‌నగర్‌లో ముస్తాబైన దేవాలయం

## ముత్యాలమ్మ జాతరకు ఏర్పాట్లు పూర్తి

- మూడ్రోజులపాటు నిర్వహణ
- తరలిరానున్న రెండు లక్షల మంది భక్తులు

హుజూర్‌నగర్, సెప్టెంబర్ 14 : హుజూర్‌నగర్‌లో ఈ నెల 15, 16, 19 తేదీల్లో నిర్వహించే ముత్యాలమ్మ జాతరకు ఆలయ కమిటీ ఆధ్వర్యంలో అన్ని ఏర్పాట్లు చేశారు. యేటా శ్రావణ మాసంలో మూడ్రోజులపాటు ఘనంగా నిర్వహించే ఈ జాతరకు ఉమ్మడి నల్లగొండ జిల్లాలో ప్రత్యేక స్థానముంది. తొలి రోజు ఆదివారం పట్టణంలోని ఊర చెరువు వద్ద ఉన్న పోంచర్ల ముత్యాలమ్మకు, రెండో రోజు సోమవారం పోచమ్మ తల్లికి, గురువారం కనకదుర్గమ్మ జాతర నిర్వహిస్తారు. మహిళలు బోనాలతో ర్యాలీగా వెళ్లి అమ్మవార్లకు చీర, సారెలను భక్తిశ్రద్ధలతో సమర్పిస్తారు. రైతులు ట్రాక్టర్లకు ప్రభలు కట్టి మేళతాళాలతో పట్టణంలో ఊరేగింపు నిర్వహించి ఆలయాల చుట్టూ ప్రదక్షిణలు చేస్తారు. జాతరను తిలకించేందుకు చుట్టుపక్కల గ్రామాల ప్రజలు అధిక సంఖ్యలో తరలివచ్చి కోళ్లు, మేకలు బలిచ్చి మొక్కులు చెల్లించుకుంటారు. యాదవుల సంప్రదాయ నృత్యాలు ప్రత్యేకంగా నిలుస్తాయి. ప్రతి ఇంటికీ బంధువుల రాకతో హుజూర్‌నగర్ పట్టణంలో శనివారం సాయంత్రం నుంచే సందడి సంతరించుకోనుంది. ఆదివారం జాతర ప్రారంభం కానుండగా.. ఆలయాలను ముస్తాబు చేశారు. ఆలయ ప్రాంగణాల్లో వీధి దీపాలను ఏర్పాటు చేశారు. పరిసర ప్రాంతాల్లో మున్సిపల్ సిబ్బంది మురుగు కాల్వలను శుభ్రం చేసి బ్లీచింగ్ పౌడర్ చల్లారు. పారిశుధ్య నిర్వహణను మున్సిపల్ కమిషనర్ యాకుబ్ పాషా పరిశీలించారు.

### ఏర్పాట్లను పరిశీలించిన ఎస్పీ సన్‌ప్రీత్ సింగ్

సుమారు 2లక్షల మంది భక్తులు వచ్చే అవకాశమున్న ఈ జాతర ఏర్పాట్లను జిల్లా ఎస్పీ సన్‌ప్రీత్ సింగ్, డీఎస్పీ శ్రీధర్‌రెడ్డితో కలిసి శనివారం పరిశీలించారు. అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా, ట్రాఫిక్‌కు ఇబ్బందులు కలుగకుండా చర్యలు తీసుకుంటున్నారు. ఆరుగురు సీఐలు, ఐదుగురు ఎస్ఐలు, 150 మంది కానిస్టేబుళ్లతో బందోబస్తు ఏర్పాటు చేస్తున్నారు.

## వణికిస్తున్న విష జ్వరాలు

### కోదాడ నియోజకవర్గంలో ప్రతి ఇంట్లో జ్వర పీడితులే...

### 30 పడకల దవాఖానలో ముగ్గురే వైద్యులు

- జనరేటర్ లేక చీకట్లో రోగుల అవస్థలు
- సర్కారులో సేవలు అందక ప్రైవేట్ దవాఖానలకు..
- వైద్యులను భర్తీ చేసి వసతులు కల్పించాలని వేడుకోలు

కోదాడ, సెప్టెంబర్ 14 : కోదాడ నియోజకవర్గం మూడు నెలల నుంచి వైరల్ ఫీవర్స్‌తో విలవిల్లాడుతున్నది. డెంగ్యూ, మలేరియా, చికున్‌గున్యా వంటి జ్వరాలతో ప్రజలు అనారోగ్యం పాలవుతున్నారు. ప్రతి ఇంట్లో ఒకరో, ఇద్దరు జ్వర పీడితులు ఉంటున్నారు. దీనికితోడు ఇటీవల కురిసిన భారీ వర్షాలతో ఇండ్లలోకి నీరు చేరడంతోపాటు వీధులన్నీ బురదమయమై పారిశుధ్యం అధ్వానంగా తయారైంది. దాంతో ఈ వ్యాధులు మరింతగా విజృంభిస్తున్నాయి. ఇప్పటికే నియోజకవర్గంలో డెంగ్యూతో నలుగురు చనిపోయినట్లు అధికారిక లెక్కలే స్పష్టం చేస్తున్నాయి. వైద్యాధికారులు గ్రామాలను సందర్శించి వెళ్తున్నారే గానీ.. వైద్య సేవలు మాత్రం ఆ స్థాయిలో అందడం లేదని ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కోదాడలో 30 పడకలు, నడిగూడెంలో 10 పడకల దవాఖానలో పూర్తిస్థాయిలో వైద్యులు లేక రోగులకు సరైన సేవలు అందడం లేదు. ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లోనూ ఇదే దుస్థితి నెలకొంది.



కోదాడ 30 పడకల దవాఖానలో వైద్య సేవలు అందక వెలవెలబోతున్న రోగుల వార్డు

### 30 పడకల దవాఖానలో ముగ్గురే వైద్యులు..

కోదాడ పట్టణంలోని 30 పడకల దవాఖాన సమస్యల కూపంగా మారింది. నియోజకవర్గ వ్యాప్తంగా ఈ దవాఖానకు గతంలో 350 నుంచి 400 దాకా రోగులు వచ్చేవారు. ఇక్కడ మొత్తం 16 మంది వైద్యులు విధులు నిర్వర్తించాల్సి ఉండగా, ప్రస్తుతం ముగ్గురే ఉన్నారు. సూపరింటెండెంట్ దశరథనాయక్‌తోపాటు జనరల్ సర్జన్, కాంట్రాక్ట్ పద్ధతిలో గైనకాలజిస్ట్ మాత్రమే సేవలందిస్తున్నారు. పూర్తిస్థాయి వైద్యులు లేక 24 గంటలు వైద్య సేవలు అందడం లేదు. దాంతో రోగులు ప్రైవేట్ దవాఖానలను ఆశ్రయించాల్సి వస్తున్నది. 30 పడకల దవాఖానలో రక్త పరీక్షలకు కూడా రెండు, మూడు రోజుల సమయం పడుతున్నదని రోగులు వాపోతున్నారు. జనరేటర్ సౌకర్యం లేకపోవడంతో కరెంట్ అంతరాయం ఏర్పడినప్పుడు రోగులు అంధకారంలో ఉక్కపోతతో తీవ్ర అవస్థ పడుతున్నారు. మరోవైపు టెక్నీషియన్ లేనికారణంగా అల్ట్రాసౌండ్ స్కానింగ్ మెషీన్ నిరుపయోగంగా మారింది.

### వెక్కిరిస్తున్న వంద పడకల శిలాఫలకం

బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో 30 పడకల దవాఖానను వంద పడకలకు అప్‌గ్రేడ్ చేస్తూ కేసీఆర్ ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. భవన నిర్మాణానికి రూ.29 కోట్లు కూడా మంజూరు చేసింది. మంత్రులు ఉత్తమ్‌కుమార్‌రెడ్డి దామోదర రాజనర్సింహ, తుమ్మల నాగేశ్వరరావు అందుకు శిలాఫలకం వేసి ఎనిమిది నెలలు గడుస్తున్నా పనులు మాత్రం ప్రారంభం కాలేదు. జనరల్ ఫిజీషియన్, ఆర్థోపెడిక్, రేడియాలజిస్ట్, గైనకాలజిస్ట్ పోస్టులను భర్తీ చేయడంతోపాటు ఏడుగురు శానిటరీ సిబ్బందిని మంజూరు చేయాలని మంత్రి ఉత్తమ్‌కుమార్ వైద్య విధాన్ పరిషత్‌కు లేఖ రాసినట్లు సూపరింటెండెంట్ చెప్పున్నా ఆచరణలో మాత్రం అవస్థలు తీరలేదు.

### వైద్యుల పోస్టులను భర్తీ చేయాలి



కోదాడలోని 30 పడకల ప్రభుత్వ దవాఖానకు పరిసర ప్రాంతాల నుంచి నిరుపేదలు రోజుకు 350కి పైగా వచ్చేవారు. 16 మంది వైద్యులకు ముగ్గురే సేవలందిస్తుండటంతో గత్యంతరం లేక ప్రైవేట్ దవాఖానలకు వెళ్లాల్సి వస్తుంది. ఈ విషయాన్ని మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి ఇటీవల నిర్వహించిన సమీక్షలో పలువురు ఆయన దృష్టికి తీసుకెళ్లారు. ప్రజల ఆరోగ్యాన్ని దృష్టిలో ఉంచుకుని వైద్యుల పోస్టులు భర్తీ చేయాలి.

- కుదరవెల్లి బసవయ్య, సామాజిక కార్యకర్త, కోదాడ

### పీహెచ్‌సీలో సరిపడా మందులు లేవు



నియోజకవర్గ వ్యాప్తంగా మూడు నెలలుగా డెంగ్యూ, మలేరియా, చికున్ గున్యా వంటి విషజ్వరాలు ప్రజలను ఇబ్బందులకు గురిచేస్తున్నాయి. ఈ క్రమంలో ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో సరిపడా మందులు లభించకపోవడంతో గ్రామాల్లో ఆర్ఎంపీలను ఆశ్రయించాల్సి వస్తుంది. ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో అవసరమైన మందులను అందుబాటులో ఉంచాలి.

- అబుబకర్, మాతానగర్, కోదాడ


నమస్తే తెలంగాణ
- జన్మదిన శుభాకాంక్షలు
- పొలిటికల్
- స్వదేశాగమనం
- లీగల్ ప్రకటనలు
- క్లాసిఫైడ్స్
- పదవీ విరమణ
- ప్రారంభోత్సవం
- శ్రద్ధాంజలి
- సినిమా
- వివాహ మహోత్సవం
- షష్టిపూర్తి మహోత్సవం
మరియు
- అన్ని శుభకార్యాలు

నమస్తే తెలంగాణ దినపత్రికలో ప్రకటనల కోసం మీ ప్రాంతంలో మా ప్రతినిధి అందుబాటులో ఉన్నారు సంప్రదించండి.
సెల్: 9182777625
నల్లగొండ : 9182 777 635
నకిరేకల్ : 9182 777 635
సూర్యాపేట : 9182 777 630
మిర్యాలగూడ : 9182 777 059
యాదాద్రి భువనగిరి : 9182 777 638
కోదాడ : 9182 777 630
హుజూర్‌నగర్ : 9182 777 059
హాలియా : 9182 777 059
దేవరకొండ : 9182 777 635
చౌటుప్పల్ : 9182 777 638